సీరియల్ కిల్లర్‌కు జీవితఖైదు

- శిక్ష ఖరారు చేసిన సంగారెడ్డి కోర్టు
- 2003 నుంచి హత్యల పరంపర
- మృతులంతా మహిళలే

పటాన్‌చెరు, ఏప్రిల్ 16: 2003 నుంచి దాదాపు పది మంది మహిళలను హత్య చేసి ఆభరణాలు దొంగిలించిన నిందితుడికి సంగారెడ్డి కోర్టు జీవిత ఖైదును విధించింది. మంగళవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డిజిల్లా ఆరుట్లకు చెందిన మాయ ని రాములు అలియాస్ మన్నె సాయిలు (42) డ్రైవర్. 2019 జూలై 11న రం గారెడ్డి జిల్లా గండీడ్ మండలం నాంచర్ల గ్రామానికి చెందిన అంజలమ్మ (40)ను చేవెళ్ల బస్టాండ్ వద్ద తన వాహనంలో ఎక్కించుకొని పటాన్‌చెరు మండలం లక్డారానికి తీసుకొచ్చాడు. లింగసానికుం ట వద్ద గొంతునులిమి చంపి, రూ.120 నగదు, సెల్‌ఫోన్ దొంగిలించాడు. 2003 లో ఓ మహిళను తూప్రాన్‌లో గొంతునులిమి చంపి వెండి ఆభరణాలు దొంగిలించాడు. 2016లో ఆరుట్లలో ఓ మహిళ గొంతును లిమి చంపాడు. 2008లో బాచుపల్లి పరిధిలో మరో మహిళను కొట్టిచంపాడు. 2008లో నర్సాపూర్‌లో ఒక మహిళను చంపి, వెండి ఆభరణాలు దొంగిలించాడు. 2009లో నార్సింగి ఏరియాలో మాచునూర్ జింకల పార్కు వద్ద మహిళను హత్యచేసి వెండి ఆభరణాలు తస్కరించాడు. కూకట్‌పల్లి జన్మభూమి కాలనీలో మహిళను చంపి చెవికమ్మలు, బంగారు గొలుసు దొంగిలించాడు. అల్విన్ కాలనీ మహంకాళి టెంపుల్ అమ్మవారి మెడలో నుంచి 10 గ్రాముల గోల్డ్‌చైన్ దొంగతనం చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇతనిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఇతని నేరాలను కోర్టులో సాక్ష్యాధారాలతో రుజువు చేయడంతో మంగళవారం సంగారెడ్డి 2వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు మెజిస్ట్రేట్ డాక్టర్ పీపీ కృష్ణా అర్జున్ నిందితుడికి జీవిత ఖైదు విధించారు. రూ.3 వేల జరిమానా విధించారు.

పోలింగ్ సమయం పెంచాలి

- ఎండలు ఎక్కువయ్యే అవకాశం..
- సా. 6 గంటల వరకు ఉండాలి
- ఈసీకి లోక్‌సభ అభ్యర్థుల విజ్ఞప్తి
- రాష్ట్రంలో 5 గంటల వరకే!
- అందుబాటులో టెంట్లు, ఫ్యాన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమయం పెంచాలని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కోరుతున్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం అదనపు ఏర్పాట్లు చేసేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది. రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత అభ్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. ఇప్పటికే ఎండలో ప్రచారం తమకు సవాలుగా మారగా.. పోలింగ్ రోజున ఓటర్లను తరలించడం మరో సవాలుగా మారే అవకాశమున్నది. ఇప్పుడే పలు పట్టణాలు, నగరాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకుండటుండగా.. పోలింగ్ జరుగనున్న మే 13న ఎండ తీవ్రత మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో పోలింగ్ శాతం తగ్గుతుందేమోనని, అలా తగ్గితే ఎవరికి అనుకూలంగా మారుతుందోనని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రితంసారి 2019లో ఏప్రిల్ 11న లోక్‌సభ ఎన్నికలు జరుగగా, అంతకు నాలుగు నెలల ముందు జరిగిన అసెంబ్లీ పోలింగ్ కంటే తొమ్మిది శాతం తక్కువగా నమోదైంది. ఈ సారి మరో నెల రోజులు ఆలస్యంగా పోలింగ్ జరుగనుండగా.. ఆ సమయానికి ఎండల తీవ్రత పెరిగే అవకాశ ఉన్నదని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పోలింగ్ సమయాన్ని మరో గంట పొడిగించాలని అభ్యర్థులు కోరుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే జారీచేసిన మూడు విడత ఎన్నికల నోటిఫికేషన్‌లలో ఈశాన్య రాష్ట్రాలు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపింది. అయితే తెలంగాణలో మాత్రం సాయంత్రం 5 గంటల వరకే పోలింగ్ ఉంటుందని, దీనికి అనుగుణంగానే ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర అధికారులు చెప్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఒక విధంగా, తెలంగాణలో మరో విధంగా ఉండటాన్ని ఆయా పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలలాగా తెలంగాణలో కూడా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని కోరుతున్నాయి. పోలింగ్ సమయాన్ని పెంచడం వల్ల మాత్రమే ఓటింగ్ శాతాన్ని పెంచగలమని సూచిస్తున్నాయి. ఇప్పటికే శీతాకాలంలో జరిగిన మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నగరాల్లో పోలింగ్ శాతం అత్యల్పంగా నమోదైందని, ఎండల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా తగ్గే అవకాశమున్నదని హెచ్చరిస్తున్నాయి. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ సమయాన్ని పొడిగించాలని కోరుతున్నాయి.

టెంట్లు, ఫ్యాన్లు

వేసవిలో పోలింగ్‌కు వచ్చే వారు ఇబ్బందులు పడకుండా కేంద్రాల వద్ద టెంట్‌లు, షేడ్‌నెట్, కుర్చీలు, ఫ్యాన్‌లు ఏర్పాటు చేయాలని ఎన్నికల అధికారులు నిర్ణయించారు. క్యూలైన్లు పెద్దగా ఉండేచోట ఓటర్లు అలసిపోకుండా కుర్చీలు కూడా ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు పెడస్టల్ ఫ్యాన్లు, పెద్ద ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఏర్పాటుచేసిన విధంగా తాగునీరు, మూత్రశాలలు, ర్యాంప్, వీల్‌చైర్లను కూడా అందుబాటులో ఉంచనున్నారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ కోసం 60 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రానికి చేరాయి. త్వరలోనే మరో 100 కంపెనీలు రాష్ట్రానికి రానున్నాయి. సమీప రాష్ట్రాల నుంచి కూడా పోలీసు బలగాలను రప్పించేందుకు ఉన్నతాధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

బీజేపీ అభ్యర్థులకు కేసుల వివరాలు అందజేత

పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థులకు వారిపై ఉన్న కేసుల వివరాలను ఎందుకు ఇవ్వడం లేదని హైకోర్టు ప్రశ్నించింది. అందుకు కారణాలే మిటో తెలపాలని పోలీసులను ఆదేశించింది. బీజేపీ అభ్యర్థులపై ఉన్న కేసుల వివరాలను అధికారులు ఇవ్వడం లేదంటూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. బీజేపీ అభ్యర్థులపై వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలివ్వాలని కోరుతూ మార్చి 7, 14న డీజీపీకి వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో వారిపై ఉన్న కేసుల వివరాలు తెలుసుకుని చెప్పాలని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించారు. అయితే, మధ్యాహ్న భోజన విరామం తర్వాత పిటిషనర్ తరఫు న్యాయవాది కల్పించుకుని తాము కోరిన వివరాలన్నీ డీజీపీ నుంచి అందాయని చెప్పడంతో విచారణను ముగిస్తున్నట్టు హైకోర్టు ప్రకటించింది.

ఏపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు జైలు శిక్ష

- దళితులకు శిరోముండనం కేసులో విశాఖ కోర్టు సంచలన తీర్పు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : ఇరవై ఏడేండ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన దళితుల శిరోముండనం ఘటన కేసులో విశాఖ కోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఎమ్మెల్సీ, ప్రస్తుతం మండపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుతో పాటు తొమ్మిది మంది నిందితులకు 18 నెలల జైలుశిక్ష, లక్షన్నర జరిమానా విధించింది. తోట త్రిమూర్తులు 1994లో రామచంద్రాపురం నుంచి ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత స్థానిక దళితులపై దాడులకు పాల్పడ్డారు. రాజకీయంగా తనకు ఎదురొస్తున్నారనే అక్కసుతో రామచంద్రాపురం మండలం వెంకటాయపాలెంలో 1996 డిసెంబర్ 29న ఐదుగురు దళితుల్ని హింసించి కనుబొమ్మలు తొలగించి, శిరోముండనం చేశారు. దాదాపు 27 ఏండ్ల తర్వాత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో విశాఖ కోర్టు తీర్పు వెలువరించింది. నిందితులకు 18 నెలల జైలుశిక్షతో పాటు రూ. లక్షన్నర జరిమానా విధించింది. కోర్టు తీర్పుపై దళిత, ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

పబ్లిక్ సెక్టార్ల మూసివేతే బీజేపీ ముసాయిదా

- వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్

హైదరాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): కేంద్రప్రభుత్వం పబ్లిక్ సెక్టార్లను ధ్వంసం చేస్తున్నదని, వాటి మూసివేతే బీజేపీ ప్రభుత్వ ప్రధాన ముసాయిదా అని కవి, రచయిత, వీక్షణం మాసపత్రిక సంపాదకుడు ఎన్ వేణుగోపాల్ ఆరోపించారు. పబ్లిక్ సెక్టార్ల మూసివేతకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'పబ్లిక్ సెక్టార్ల మూసివేత- సమాజంపై ప్రభావం'పై నిర్వహించిన సదస్సులో వేణుగోపాల్ మాట్లాడుతూ.. దేశంలో ఐదు వేలకు పైగా ప్రభుత్వ రంగ సంస్థలు ఉండేవని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2,900 పరిశ్రమలే ఉన్నాయని తెలిపారు. చిన్నతరహా పరిశ్రమల మూసివేతకు ప్రధాని మోదీ కారణమని మండిపడ్డారు. నిజాం చక్కెర ఫ్యాక్టరీకి చెందిన ఏడు వేల ఎకరాలభూమిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. సదస్సులో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాబు బెయిల్ రద్దుపై విచారణ వాయిదా

- మే 7వ తేదీ విచారణ చేపడతామన్న ఏపీ హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): స్కిల్ కేసులో తెలుగుదేశం అధినేత చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఏపీ ఏసీబీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై విచారణను మే 7వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం తెలిపింది. మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు ర్యాలీలు, బహిరంగ సభల్లో పాల్గొనేలా సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని.. ఆయన కొడుకు లోకేశ్ మాత్రం అధికారులను బెదిరించేలా మాట్లాడుతున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే దర్యాప్తు అధికారుల సంగతి చూస్తామని బెదిరిస్తున్నారని, ఈ అంశంపైనే ఇంటర్లొకేటరీ అప్లికేషన్- ఐఏ దాఖలు చేశామని చెప్పారు. హైకోర్టు విధించిన బెయిల్ షరతులను చంద్రబాబు ఉల్లంఘిస్తున్నారని అన్నారు. చంద్రబాబు తరఫున న్యాయవాది సిద్దార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ లోకేశ్ మాట్లాడితే.. చంద్రబాబు బెయిల్ షరతులు ఉల్లంఘించినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం సమర్పించిన ఐఏ తమ వద్ద లేదని జస్టిస్ బేలా త్రివేది పేర్కొన్నారు. దానిని రికార్డుల నుంచే తీసుకుంటామని తెలుపుతూ విచారణను వాయిదా వేశారు.

బీజేపీని గెలిపించేది కాంగ్రెస్సే!

- గులాం నబీ ఆజాద్ వ్యాఖ్యలు

దోడా: కాంగ్రెస్ పార్టీపై డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) అధినేత గులాం నబీ ఆజాద్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీని గెలిపించాలని కాంగ్రెస్ కోరుకుంటున్నట్టు కొన్నిసార్లు తనకు అనిపిస్తుంటుందని అన్నారు. 'బీజేపీతో కాంగ్రెస్ జట్టుకట్టిందేమోనని కొన్ని సార్లు నాకు అనుమానం కలుగుతున్నది. కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత మార్పుల కోసం పార్టీలోని 23 మంది పోరాడినా అగ్ర నాయకత్వం పట్టించుకోలేదు. సమస్య వివరించిన ప్రతీసారి తమది బీజేపీ భాష అంటూ హైకమాండ్ విమర్శించేది' అని ఆయన తెలిపారు.

భూ కక్ష్యలో సైనిక విన్యాసాలు!

కాలిఫోర్నియా, ఏప్రిల్ 16: భూమిపైనే కాకుండా భూమి వెలుపల ఎదురయ్యే ముప్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అమెరికా సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా ప్రపంచంలోనే తొలిసారిగా ఆ దేశ వింగ్ స్పేస్ ఫోర్స్ (యూఎస్ఎస్ఎఫ్) భూకక్ష్యలో సైనిక విన్యాసాలను నిర్వహించనున్నది. ఈ మేరకు అమెరికా స్పేస్ ఫోర్స్ ఇటీవల రాకెట్ ల్యాబ్ నేషనల్ సెక్యూరిటీ, ట్రూ అనోమలీ అనే ప్రైవేటు అంతరిక్ష కంపెనీలతో ఒప్పందం చేసుకొన్నదని స్పేస్ సిస్టమ్స్ కమాండ్ పేర్కొన్నది. 'విక్టస్ హేజ్' అని పేరు పెట్టిన ఈ మిషన్ 2025లోగా అమలు చేసే అవకాశం ఉన్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు కంపెనీలు స్పేస్ ఫోర్స్‌కు అవసరమైన ఆర్పీవో, అంతరిక్ష నౌకలు వంటివి అందించనున్నాయి. ట్రూ అనోమలీకి చెందిన స్పేస్ వెహికల్ 'జాకల్',రాకెట్ ల్యాబ్‌కు చెందిన మానవరహిత వాహనం కక్ష్యలో సంభవించే ప్రతికూల పరిస్థితులకు స్పందించే యూఎస్ స్పేస్ ఫోర్స్ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయి.

కాంగ్రెస్‌పై మాదిగల్లో ఆగ్రహం: మోత్కుపల్లి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 16: రాష్ట్రంలో మాదిగలకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ కేటాయించకపోవడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఇది తన రాజకీయ జీవితంలో చూసిన విచిత్రమైన సంఘటన అని ఆయన అభివర్ణించారు. సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్టీఎస్ఏ) ఆధ్వర్యంలో మహనీయుల జయంతిని మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఎస్టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ అధ్యక్షతన 'మాదిగల వాటా కోసం మాట - సామాజిక తెలంగాణ సాధన కోసం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మోత్కుపల్లి మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యంత శక్తివంతులుగా ఉన్న మాదిగ సామాజికవర్గానికి ఎంపీ టికెట్ కేటాయించకపోవడం పట్ల వారి రాజకీయ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. మాదిగల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ గురయ్యే అవకాశం ఉన్నదని హెచ్చరించారు. తాను రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని, కానీ మాదిగల నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రజల్లో తిరగలేకపోతున్నానని వాపోయారు. ఇప్పటికైనా సమయం ఉన్నదని, పార్టీ నాయకత్వం పునరాలోచించి, మాదిగలకు జనాభా అనుగుణంగా టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ప్రొఫెసర్ కాశీం, ఈరమిళ్ళ రాధిక, సురేందర్, నాగేశ్వరరావు, విద్యార్థి నాయకులు లింగంపల్లి మనోజ్, సోమశేఖర్, పాల్వాయి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కానిస్టేబుళ్లకు ఎస్జీటీ పేస్కేల్ ఇవ్వాలి'

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : పోలీస్ కానిస్టేబుళ్లకు ఎస్జీటీ పేస్కేల్ ఇవ్వాలని, ఎస్సైలకు గెజిటెడ్ హోదా కల్పించాలని రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం కోరింది. ఈ మేరకు పీఆర్సీ చైర్మన్‌కు, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డికి మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై గోపిరెడ్డి, పలు జిల్లాల అధ్యక్షులు వినతిపత్రం అందజేశారు. సీనియర్ పోలీసులకు వెయిటేజీ ఇంక్రిమెంట్స్ ఇస్తూ.. రిస్క్ అలవెన్స్, పెట్రోల్ అలవెన్స్ పెంచాలని విజ్ఞప్తి చేశారు.

సకల కళాదీప్తి శ్రీరాముడు

రామాయణం.. వాల్మీకి రాస్తుంటే జరిగిందా?.. లేక జరుగుతున్న రామాయణాన్ని చూస్తూ వాల్మీకి రాశాడా? అనేది అంతుపట్టని ప్రశ్నలు. ఆయన ఎలా రాసినా.. ఎప్పుడు రాసినా.. ఇప్పటికీ రామాయణ మహాకావ్యంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. రాముడు వైకుంఠనారాయణుడని నమ్మిన వాళ్ల అభిప్రాయం ఒకలా ఉంటే.. రాముడు కేవలం రాజు మాత్రమే అనే వాళ్ల వాదన మరోలా ఉంది. ఏది ఏమైనా ఒక కావ్యం నుండి ఒక దైవం పుట్టుకురావడం.. ఒక సంస్కృతి పుట్టుకురావడం.. ఒక ధర్మం పుట్టుకురావడం.. సాధారణమైన విషయం కాదు. రామభక్తి ప్రభావం వల్ల ఈ దేశం పునీతమైందని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

రామభక్తి వల్లే త్యాగరాజస్వామి 72 మేళకర్త రాగాలను సృజించగలిగారు. ఆ మేళకర్త రాగాల నుండే అనంతమైన జన్యురాగాలు పుట్టాయి. దక్షిణభారత శాస్త్రీయ సంగీతానికి అవే పునాదులు. రామభక్తి వల్లే కంచర్ల గోపన్న శ్రీరామదాసుగా మారి, భజన కీర్తలను భావితరాలకు అందించారు. వేదవ్యాస లిఖితమైన శ్రీమద్భాగవతాన్ని బమ్మెరపోతన తెలుగీకరించారంటే ఆయనకు ఆ శక్తిని ఇచ్చింది రామభక్తే. రాముడు కేవలం ఒక మతానికి ప్రతినిధి కాదు, సంస్కృతినీ, సాహిత్యాన్నీ, కళలనూ, ప్రభావితం చేసిన కళాదీప్తి.

ఇక సకలకళల సమ్మేళనమైన సినిమాపై రాముడి ప్రభావం సామాన్యమైనది కాదు. అసలు 'హీరోయిజం' పుట్టిందే రాముడి నుంచి. ఎలివేషన్స్ క్రియేటయ్యిందే రామాయణం నుండి. 'మారీచ ఉవాచ' చదివినవారికి 'హీరో ఎలివేషన్' అంటే ఏంటో అర్థమవుతుంది. 'కేజీఎఫ్' నుండి వెండితెరపై ఎలివేషన్స్ ట్రెండ్ మొదలైంది. స్టార్ హీరో అంటే ఇప్పుడు ఎలివేషన్స్ పక్కా. వాటన్నింటికీ రామాయణ కావ్యంలో రాముడి పాత్రపై వాల్మీకి ఇచ్చిన ఎలివేషన్సే స్ఫూర్తి. రాముడి ప్రేరణగా వెండితెరపై నేటికీ హీరోలు పుడుతూనే వున్నారు.. పుడుతూనే వుంటారు.

ఇక రామాయణం ప్రేరణగా వచ్చిన సినిమాలైతే కోకొల్లలు. 'బాలనాగమ్మ' అనే చందమామ కథ తెలుగులో మూడుసార్లు నిర్మితమైంది. ఈ కథకు ప్రేరణ రామాయణం.

దర్శకుడు బాపూ అయితే రామాయణం ప్రేరణగా ముత్యాలముగ్గు, గోరంతదీపం, కలియుగ రావణాసుడు చిత్రాలను తీశారు. సంపూర్ణ రామాయణం, సీతాకల్యాణం, శ్రీరామరాజ్యం చిత్రాలతో వాల్మీకి రామాయణాన్నీ, ఉత్తర రామాయణాన్నీ సంపూర్ణంగా తెరకెక్కించిన బాపూ.. 'శ్రీరామాంజనేయ యుద్ధం' చిత్రంతో కల్పిత రామాయణాన్ని కూడా తీసి, దర్శకుడిగా ధన్యుడయ్యారు.

వెండితెరపై రామకథలు అనగానే ఠపీమని గుర్తొచ్చే సినిమాలు ఎన్టీయార్ 'లవకుశ', 'సీతారామకల్యాణం'. శ్రీరామనవమి వచ్చిందంటే పందిళ్లలో వినిపించేవి ఈ రెండు సినిమాల్లోని పాటలే. 'శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండీ..' అంటూ.. 'వినుడు వినుడు రామాయణగాథ వినుడీ మనసారా..' అంటూ నవమి పందిళ్లు రామనామంతో మారుమోగిపోతూ ఉంటాయి.

రామచంద్రమూర్తిగా ఎక్కువ సినిమాల్లో నటించిన క్రెడిట్ మాత్రం మహానటుడు నందమూరి తారక రామారావుదే. సంపూర్ణ రామాయణం(1958), లవకుశ(1963), శ్రీకృష్ణసత్య(1971), శ్రీకృష్ణాంజనేయ యుద్ధం(1972), శ్రీరామపట్టాభిషేకం(1978) ఎన్టీయార్ శ్రీరాముడిగా నటించిన సినిమాలు. ఎన్టీయార్ తర్వాత రాముడిగా మెప్పించిన హీరోలుగా హరనాథ్, శోభన్‌బాబులను చెప్పుకోవాలి. ఎన్టీయార్ 'సీతారామకల్యాణం' సినిమాలో హరనాథ్ తొలిసారి రాముడిగా కనిపించారు. ఆ తర్వాత 'రామకథ' అనే సినిమాలో కూడా రాముడిగా నటించారు. బాపు 'సంపూర్ణ రామాయణం'లో శోభన్‌బాబు రాముడిగా మెరిసి, మెప్పించారు.

అక్కినేని నాగేశ్వరావు హీరోగా నటించిన తొలి సినిమా 'సీతారామజననం'. అందులో ఆయన నటించింది శ్రీరాముడి పాత్రే. కాంతారావు కూడా వీరాంజనేయ, పాదుకా పట్టాభిషేకం చిత్రాల్లో రాముడిగా నటించారు. అలాగే అక్కినేని నాగార్జున 'శ్రీరామదాసు' చిత్రంలో సుమన్ రాముడిగా ఒదిగిపోయారు. 'శ్రీరామరాజ్యం'లో రాముడిగా నటించి, తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు బాలకృష్ణ. ఇక తారక్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 1996లో గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన 'రామాయణం'లో ఆయన రాముడిగా నటించారు. అప్పుడు తారక్ వయసు కేవలం 13ఏళ్లు. అంత చిన్నవయసులో కళ్యాణరాముడిగా తారక్ అభినయం తాతను గుర్తు చేసింది.

చివరిగా చెప్పొచ్చేదేంటంటే.. ఎంత చెప్పుకున్న తరగని ముచ్చట ఇది. నిజం చెప్పాలంటే ఓ పుస్తకమే రాయొచ్చు. అందుకే మచ్చుకి కాసేపు కళారామ స్మరణ.. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా అన్నమాట.

చిత్రం

కన్నప్ప సెట్‌లో అక్షయ్

శ్రీకాళహస్తి స్థలపురాణం నేపథ్యంలో మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్, బ్రహ్మానందం వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్‌కుమార్ సైతం ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న తాజా షెడ్యూల్‌లో ఆయన జాయిన్ అయ్యారు. చిత్ర ప్రధాన తారాగణం పాల్గొనగా కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. అక్షయ్ కుమార్ పాత్ర కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుందని, ఆయన శివుని పాత్రలో కనిపించనున్నారని చెబుతున్నారు. అక్షయ్ కుమార్ నటిస్తున్న తొలి తెలుగు చిత్రమిదే కావడం విశేషం. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

వంద సినిమాలు పూర్తి చేయబోతున్నాం

సప్తగిరి, ధనరాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహ ఉల్లాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భవనమ్'. బాలాచారి కూరెళ్ల దర్శకుడు. ఆర్.బి.చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మాతలు. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌తో పాటు ఓ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్.బి.చౌదరి మాట్లాడుతూ 'మా సంస్థకిది 95వ చిత్రం. మరో మూడు సినిమాలు చిత్రీకరణ జరుపుకుంటున్నాయి. త్వరలో 100 సినిమాల మైలురాయికి చేరుకోబోతున్నాం. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో సాగే హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇది' అన్నారు. ఓ భవనం నేపథ్యంలో ఆద్యంతం థ్రిల్లింగ్ అంశాలతో సినిమా సాగుతుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో నల్గొండ గద్దర్ నర్సన్న పాడిన 'యాదమ్మ' అనే పాట హైలైట్‌గా నిలుస్తుందని సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మురళీమోహన్ రెడ్డి, సంగీతం: చరణ్ అర్జున్, రచన, మాటలు, దర్శకత్వం: బాలాచారి కూరెళ్ల.

థ్రిల్‌ను పంచే కిడ్నాప్ డ్రామా



చైతన్యరావు, సునీల్, శ్రద్ధాదాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పారిజాత పర్వం'. 'కిడ్నాప్ ఈజ్ ఆన్ ఆర్ట్' ఉపశీర్షిక. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించారు. ఈ నెల 19న విడుదలకానుంది. సోమవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తీసిన కిడ్నాప్ డ్రామా ఇది. ఆద్యంతం వినోదంతో పాటు ఉత్కంఠను పంచుతుంది' అన్నారు. 'ఇది పూర్తిగా కాన్సెప్ట్ బేస్డ్ ఫిల్మ్. దీనికి సీక్వెల్ కూడా ఉంది' అని హీరో చైతన్య రావు తెలిపారు. వినూత్నమైన కాన్సెప్ట్ ఇదని నిర్మాత మహీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: బాల సరస్వతి, సంగీతం: రీ, రచన-దర్శకత్వం: సంతోష్ కంభంపాటి.

వినూత్న కథతో 'సిల్క్ శారీ'

వాసుదేవ్ రావు, రీవా చౌదరి, ప్రీతీ గోస్వామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సిల్క్ శారీ'. టి.నాగేందర్ దర్శకుడు. కమలేష్ కుమార్, రాహుల్ అగర్వాల్ హరీష్ చండక్ నిర్మాతలు. మంగళవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'నిజ జీవితంలో జరిగిన ఓ ఆసక్తికరమైన సంఘటన ఆధారంగా ఈ సినిమా తీశాను. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది. కథానుగుణంగా చక్కటి టైటిల్ కుదిరింది' అన్నారు. వినూత్నమైన ప్రేమకథా చిత్రమిదని హీరో వాసుదేవ్ రావు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సనక రాజశేఖర్, సంగీతం: వరికుప్పల యాదగిరి.

'అఖండ - 2' సన్నాహాలు మొదలయ్యాయి

బాలకృష్ణ షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చి రాజకీయ ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఎన్నికల వేడి తగ్గాక కె.ఎస్.రవీంద్ర(బాబీ) సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు. ఇదిలావుంటే.. బాలయ్య నెక్ట్స్ సినిమాపై రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బోయపాటి దర్శకత్వంలోనే బాలయ్య ఓ పొలిటికల్ సినిమా చేయనున్నట్టు కూడా ఓ వార్త ప్రస్తుతం మీడియా సర్కిల్‌లో వినిపిస్తున్నది. అయితే.. ఆ వార్తలన్నింటికీ చెక్ పెడుతూ దర్శకుడు బోయపాటి.. క్లియర్ అప్‌డేట్ ఇచ్చేశారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ 'ఎన్నికలు అయిపోయిన తర్వాత 'అఖండ-2'పై అధికారిక ప్రకటన ఉంటుంది. దైవభక్తి మన జీవితంలో భాగం. దాన్ని తెరపై జనానికి నచ్చేలా చూపిస్తే తప్పక ఆదరణ లభిస్తుంది అనడానికి 'అఖండ' ఓ నిదర్శనం. పసిబిడ్డ.. పకృతి.. పరమాత్మ నేపథ్యంలో 'అఖండ' తీశాం. సీక్వెల్‌లో వీటితోపాటు సమాజానికి కావాల్సిన ఓ మంచి విషయం కూడా ఉంటుంది. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ కూడా మొదలైంది' అని తెలిపారు. అంటే.. మరోసారి 'అఖండ'గా బాలయ్య విశ్వరూపం చూడబోతున్నామన్నమాట.

నితిన్‌కి జోడీగా

ఒకప్పుడు తెలుగులో అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంది పంజాబీ సోయగం రాశీఖన్నా. 'థాంక్యూ' సినిమా తర్వాత తెలుగులో ఏ చిత్రానికి అంగీకరించలేదు. ప్రస్తుతం టాలీవుడ్‌లో పూర్వ వైభవాన్ని సంపాదించుకునే ప్రయత్నాల్లో ఉందీ భామ. తాజా సమాచారం ప్రకారం ఈ అమ్మడు తెలుగులో నితిన్‌తో ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో 'రాబిన్‌హుడ్' పేరుతో సినిమా తెరకెక్కుతున్నది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమాలో రాశీఖన్నాను నాయికగా ఖరారు చేసినట్లు సమాచారం. గతంలో ఈ జంట 'శ్రీనివాస కల్యాణం' చిత్రంలో నటించారు. సుదీర్ఘ విరామం తర్వాత మరోసారి ఈ జోడీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నది. రాశీఖన్నా నటించిన తమిళ చిత్రం 'అరణ్మనై-4'...'బాక్' పేరుతో ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది.